# ప్రజా హృదయం

(గల్పిక)

దిబ్బపత్రిక ఎడిటరు మహా చిరచిరలాడుతున్నాడు.

"ఏమయింది ?" అన్నాను.

"ఎలెక్షను ! ... పాతప్రభుత్వమే గెలవాలని రోజూ సంపాదకీయాలు రాశాను. ఎక్కడో ఉత్తరదేశంలో పాత ప్రభుత్వం ఓడిపోయిందిట నాకు రోజూ తిట్టు ఉత్తరాలు ! నేను కిరాతకాన్నీ, నియంతృత్వాన్నీ, పైశాచిక పరిపాలననూ. ప్రజాశత్రువులనూ సమర్థించి ప్రజలకూ, ప్రజాతంత్రానికీ ద్రోహంచేశానుట ! నాకు రాజకీయ పరిజ్ఞానంలేదుట ! నా సంపాదకత్వం కింద దిబ్బపత్రిక ప్రజలను అజ్ఞానాంధకారంలో ఉంచిందట !"

"విచారించకు. దిబ్బలో ఒక్క సీటుకూడా పోకుండా అన్నీ పాతప్రభుత్వానికే దక్కాయిగద ! ప్రజలు తమకు నియంతృత్వమూ, దౌర్జన్యమూ కావాలనీ, స్వేచ్ఛ అక్కర్లేదనీ ఎలుగెత్తి చాటి చెప్పారు. ప్రజాహృదయాన్ని నువు చాలా కరెక్టుగా ప్రతిబింబించావు !" అన్నాను.

"వాళ్ళకు రాజకీయ పరిజ్ఞానం చేసింది నేనేట !"

"తమ్ముడూ, ప్రజలకు రాజకీయ పరిజ్ఞానం కలిగించాలని రాజకీయవేత్తలే తాపత్రయపడరు. కందకు లేని దురద కత్తి పీటకా ? ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజాభిప్రాయం తమపక్షాన ఉండాలని కోరటానికి మీటింగులు పెట్టి, ఏవో ప్రచారాలు చేస్తారు. ఇప్పుడు గెల్చిన పార్టీకి దక్షిణాది యావత్తూ వ్యతిరేకంగా వోటు చేసింది. వాళ్ళకేమన్నా బాధ ? కేంద్రం కోటలో పాగా వెయ్యటానికి అడ్డంరాలేదు. అందుచేత దక్షిణాది వేరే దేశమల్లే ప్రవర్తించినా వాళ్ళకి బాధలేదు. అందుచేత నువు గమ్మునుండు ! నిన్ను విమర్శించిన వారితో, నాకూ, మా దిబ్బకూ పంచ మహాపాతక పరిపాలనే కావాలని చెప్పు, వాళ్ళ రోగం కుదురుతుంది !" అన్నాను.

---

**కొడవటిగంటి కుటుంబరావు**